క్లుప్తంగా

21 మంది బైండోవర్

అల్లవరం: మండలంలోని 12 మంది కోడి పందేలు, గుండాట, పేకాట నిర్వాహకులపై అల్లవరం పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిని అల్లవరం మేజిస్ట్రేట్ కోర్టులో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు ముందు బుధవారం హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ. 25 వేలు పూచీకత్తుపై విడుదల చేయడం జరిగిందని అల్లవరం పోలీసులు తెలిపారు.

అమలాపురం టౌన్: అమలాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం బెల్ట్ షాపులను నిర్వహిస్తున్న 9 మంది నిందితులపై బైండోవర్ కేసులను బుధవారం నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అంబాజీపేట మండలంలో ముగ్గురు పాత నిందితులు, అమలాపురం మండలంలో ఒక పాత నిందితుడు, అల్లవరం మండలంలో ఒక నిందితుడు, అయినవిల్లి మండలంలో నలుగురు నిందితులను బైండోవర్ చేసి వారిని ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట హాజరు పరిచామన్నారు. ఒక్కో నిందితుడికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక నామన వెంకాయమ్మ జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కోరంగి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి క్రీడా పోటీలను కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణతో కలిసి సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జె.ఆశాలత, ఉపాధ్యాయులు వాకపల్లి అప్పారావు, పుల్లేటి కిషోర్, ఫిజికల్ డైరెక్టర్‌లు ఎంవీ నాగేంద్ర, వి.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: సంక్రాంతి సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముమ్మిడివరం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో ప్రజలంతా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా సంస్కృతీ సంప్రదాయలకు అద్దంపట్టేలా సంక్రాంతి పండగను జరుపుకోవాలని సూచించారు.

కోనసీమ రెవెన్యూ కేర్ ఓపెన్ హౌస్ నిర్వహణ

అమలాపురం రూరల్: కోనసీమ రెవెన్యూ కేర్ ఓపెన్ హౌస్ పేరిట జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి చెందిన ముగ్గురు ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు అందించారు. ఫిర్యాదులను సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే ప్రభాకర్‌కు పరిష్కారం నిమిత్తం పంపడం జరిగిందన్నారు. రెండు నెలలకు ఒకసారి రెండో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు పౌర సరఫరాల ఉద్యోగుల సర్వీస్ అంశాలపై వినతులు స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

వేమన పద్యాలతో వ్యక్తిత్వ వికాసం

అమలాపురం రూరల్: వేమన పద్యాలు నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్ అన్నారు. అనంతపురం వేమన ఫౌండేషన్, ఎస్‌కేబీఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో వేమన జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం కళాశాలలో వేమన పద్య పోటీలు జరిగాయి. విజేతలకు జ్ఞాపిక, పతకాలు, ప్రశంసా పత్రాలు, వేమన పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై గురువారం ఉదయం 10. 30 నుంచి 11.30 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 9581932678 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

భట్లపాలెంలో శ్రీ చందన అలంకార దర్శనం

అమలాపురం రూరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఇందుపల్లి పరిధిలోని భట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష చందనోత్సవం, శ్రీచందన అలంకార దర్శనం జరుగుతుందని ఆలయ అర్చకుడు సుదర్శనం చింటూ తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి గ్రామ పంచాయతీలో రూ.45 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్ బుధవారం భూమిపూజ చేశారు. పంచాయతీ పరిధిలోని సీతారామపురంలో రూ.18 లక్షలు, పాతకోరంగిలో రూ.12.50 లక్షలు, పెద్దబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో రూ.14.60 లక్షలతో చేపట్టనున్న రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.

ఐఏఎల్ డైరీ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర శాఖ 2025 నూతన సంవత్సరానికి ముద్రించిన డైరీని స్థానిక బార్ అసోసియేసన్ కార్యాలయంలో రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి వి.నరేష్ బుధవారం ఆవిష్కరించారు. ఐఏఎల్ డైరీలో న్యాయవాదులకు ఉపయుక్తమైన సమాచారం పొందిపరిచారని జిల్లా జడ్జి నరేష్ అన్నారు.

ఆక్రమణలు.. అక్రమ నిర్మాణాలు

- అక్రమార్కుల చెరలో పంట కాలువలు
- కాలువ గట్లపై దర్జాగా నిర్మాణాలు
- పలుచోట్ల వ్యాపార దుకాణాల నిర్వహణ
- శివారుకు సాగునీరు అందక రైతుల అగచాట్లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



గాడిమొగ రహదారిలో పంట కాలువ వంతెనపై ఏర్పాటు చేసిన వ్యాపార దుకాణాలు

తాళ్లరేవు: సాగునీరు, తాగునీరు సరఫరా చేయాల్సిన పంట కాలువలు ఆక్రమణ చెరలో చిక్కి శల్యమవుతున్నాయి. పలువురు అక్రమార్కులు పంట కాలువలను దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. కొందరైతే పంట కాలువలను ఆక్రమించి వ్యాపార దుకాణాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పక్కా నిర్మాణాలు చేస్తున్నారు. దీంతో నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ముఖ్యంగా ఆక్రమణల కారణంగా శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందక అనేక అగచాట్లు పడుతున్నారు. పలు ప్రధాన కాలువల వెంబడి స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో దర్జాగా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా కనీసం వారికి నోటీసులు కూడా ఇవ్వకపోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అడిగేవారే లేరు

పంట కాలువ గట్లను ఆక్రమించుకుని నిర్మాణాలు సాగించేవారు కొందరైతే పంట కాలువలపై దర్జాగా పక్కా నిర్మాణాలు చేసేవారు మరికొందరు. తాళ్లరేవు మండల పరిధిలోని కోరంగి కాలువ చెంతన అనేక మంది అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు.



సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారిపేటలో పంటబోదెపై నిర్మించిన పక్కా భవనం



కోరంగి కాలువలో వ్యర్థాలతో కదలని పంట నీరు

తాళ్లరేవు–గాడిమొగ రహదారిలోని కోరంగి కాలువపై వంతెన వేసి పలువురు పలు వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుని దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. అదేవిధంగా సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారిపేటలో పంటబోదెపై ఒక వ్యక్తి పక్కా నిర్మాణాన్ని నిర్మించి రెండు దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

అన్నదాతల ఇక్కట్లు

పంట కాలువల ఆక్రమణ, నిర్వహణ లేకపోవడంతో కాలువల్లో నీరు పారే పరిస్థితి లేకుండా పోయింది. చాలా కాలువల్లో తూడు పెరిగి పోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటిని సైతం పంట కాలువల్లోకి మళ్లించడం తదితర కారణాలతో నీరు పారని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వరిచేలకు నీరందటం లేదు



పంట కాలువలోని సాగునీరు పూర్తి స్థాయిలో రాకపోవడంతో వరిచేలకు నీరు పెట్టుకునేందుకు అవస్థలు పడుతున్నాము. కొన్నిసార్లు కాలువలో నీరు లేకపోవడంతో ఇంజన్లతో తోడుకోవాల్సిన పరిస్థితి. కాలువల్లో తూడు, వ్యర్థాలను తొలగించి పూర్తి స్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలి.

ఎం.తాతారావు, రైతు, తాళ్లరేవు.

వ్యర్థాలతో అవస్థలు



పంట కాలువ చెంతన ఉన్న గృహాలు, వ్యాపార దుకాణాల వ్యర్థాలను కాలువలోకి వదిలి వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు కారణంగా వరిచేలు దెబ్బతింటున్నాయి. ఆక్రమణల కారణంగా పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు.

కె.రాంబాబు, రైతు, కోరంగి.

ఈదరపల్లి వంతెన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు



ఈదరపల్లి వంతెన ఫుట్‌పాత్‌కు పడిన రంధ్రాలను సిమెంట్ బల్లలతో మూసివేసి మరమ్మతులు చేపట్టిన దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా నిలుస్తున్న ఈదరపల్లి శిథిల వంతెనపై ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. వంతెన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేపట్టారు. గత నెల 30న ఈ వంతెన శిథిలావస్థకు చేరిన దుస్థితిపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి వంతెన ఫుట్‌పాత్‌కు పడిన రంధ్రాలను బుధవారం మూసివేశారు. వంతెన ఫుట్‌పాత్‌పై పడిన పెద్ద పెద్ద రంధ్రాలతో వంతెన కింద ప్రవహిస్తున్న పంట కాల్వలో నీరు కనిపించే స్థాయిలో శిథిలావస్థకు చేరుకున్నట్లు కథనంలో ప్రచురితమైంది. శిథిల వంతెన రోధిస్తున్నట్లుగా వంతెన మనో వేదనను కథనంగా ప్రచురించడంతో పలువురు పట్టణ వాసులను ఆలోచింపజేసింది. అధికారులు స్పందించడంతో సాక్షి కథనంపై పలువురు హర్షం వెలిబుచ్చారు.

భూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంతో పాటు రీ సర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సదస్సులు, ఫ్రీ హోల్డ్ భూముల డేటాఎంట్రీ అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులలో అందిన ఫిర్యాదులపై గ్రామాల వారీగా నివేదికలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ. నిషాంతి, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, భూ పరిపాలన ఉప తహసీల్దార్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం అయినవిల్లి విద్యుత్ ఉపకేంద్రం వరకు 64 టవర్లు ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణకోసం భూయజమానులతో సమావేశం నిర్వహించి భూముల విలువలపై సమీక్షించారు. ఒక్కొక్క టవర్ ఏర్పాటుకు సుమారుగా రెండు లక్షలు చొప్పున ఖర్చవుతుందని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు.

భూముల మార్కెట్ విలువ పెంపుపై అవగాహన

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ శివరాం

ముమ్మిడివరం: భూముల మార్కెట్ విలువ పెంపుపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరముందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ బి.శివరాం పేర్కొన్నారు. ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రభుత్వం ఇంప్లిమెంట్ చేయనున్న మార్కెట్ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సబ్ రిజిస్ట్రార్లకు సూచించినట్లు తెలిపారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి వారికి మార్కెట్ విలువ పెంపుపై అభ్యంతరాలుంటే జనవరి 24 వరకు స్వీకరించి ప్రభుత్వానికి నివేదించాలని సూచించినట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ నిర్ణయం మేరకు ఏరియాల ప్రకారం పెంచిన ధరలను జనవరి 17న ప్రజల ముందుంచి 24 వరకు అభ్యంతరాలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఇందుకనుగుణంగా ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ ఎం.సుధాకర్‌కు సూచించినట్లు ఐజీ శివరాం తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

అమలాపురం టౌన్: పేదలకు ఆరోగ్య సంజీవిని అయిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా, సమర్థంగా అమలు చేసి పేదలకు అన్ని వేళలా అందుబాటులో ఉంచిందని ఆయన గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ అంటే ఓ భరోసా, నమ్మకం ఉండేదని, ఆ నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం ఒమ్ము చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించలేక ఇలా బీమా అంటూ చేతులెత్తేసినట్లు మాట్లాడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్న కూటమి ప్రభుత్వం కనీసం పేదలకు ఉచిత వైద్యం అందించే ఆరోగ్యశ్రీ పథకాన్నైనా సక్రమంగా అమలు చేసి ఆరోగ్య భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడోత్సవం



ఐ.పోలవరంలో కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

ఐ.పోలవరం: ‘కోనసీమ క్రీడోత్సవం– ఆటలతో ఆరోగ్యం’లో భాగంగా రెండో రోజు పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలు హుషారుగా సాగాయి. మండల పరిధిలోని ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు పోటీలు జరిగాయి. బాలురకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, 400 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో తలపడ్డ క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మండలంలోని జెడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ బొలిశెట్టి వీర్రాజు, హెచ్ఎం వీధి సురేష్ బాబు, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అనసూరి వీర వెంకట సత్యనారాయణ, తహసీల్దార్ విజయ్, ఎంపీడీవో శర్మ, ఎంఈవో కొండారెడ్డి, తిరుమలరావులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మండలంలో కోనసీమ క్రీడోత్సవం కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాల, ఎంజీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన పోటీలలో హైస్కూల్ బాలికల వాలీబాల్ విభాగంలో ముమ్మిడివరం బాలికల ఉన్నత పాఠశాల, అనాతవరం ప్రభుత్వ పాఠశాలలు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఖోఖో విభాగంలో ముమ్మిడివరం బాలికల పాఠశాల, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఫైనల్‌కు చేరుకున్నాయి. క్రికెట్ విభాగంలో ఫైనల్స్‌లో తలపడిన ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాల విన్నర్‌గాను, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రన్నర్‌గాను నిలిచాయి. బ్యాట్మింటన్ ఫైనల్‌లో ముమ్మిడివరం బాలికల ఉన్నత పాఠశాల విన్నర్‌గా, ఠానేల్లంక ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ బాలుర విభాగంలో ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాల విన్నర్‌గా, గేదిల్లంక ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీ విభాగంలో ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాల విన్నర్‌గా, అనాతవరం ప్రభుత్వ పాఠశాల రన్నర్‌గా నిలిచాయి.

ఉత్సాహంగా ఫ్యామిలీ క్రిస్మస్

తాళ్లరేవు: తాళ్లరేవు, యానాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ స్వగృహంలో జరిగిన కార్యక్రమానికి సుమారు 110 మంది సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు దొమ్మేటి వసంతరావు పుట్టినరోజు సందర్భంగా కేకు కట్‌చేసి అందరికీ పంచారు.

చెల్లించాల్సిన బకాయిలు లేవు

యానాం: రీజెన్సీ భారీ పరిశ్రమ మూసివేతతో 12 ఏళ్లుగా తీవ్ర నష్టం వాటిల్లిందని దీనికి తోడు వందలాది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని ఫ్యాక్టరీ ప్రారంభానికి సహకరించాలని బుధవారం ఎల్జీ కె కైలాష్‌నాథన్‌ను కలిసి ఆ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కంపెనీ బకాయిలు, వాణిజ్య పన్నులు, కార్మిక, విద్యుత్, మున్సిపాలిటీకి సంబంధించిన బకాయిలు రూ.70 కోట్లు ఉన్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. కంపెనీని తిరిగి పునఃప్రారంభించేలా సహకరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అబ్బుర పరిచిన వైజ్ఞానిక నమూనాలు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని సోరపల్లి సత్యవర్ధన, పదో తరగతి విద్యార్థిని పరమట రోహిణిలు వినూత్న రీతిలో వైజ్ఞానిక నమూనా తయారు చేసి ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థులు పాత ఇనప సామాన్లతో ఏకంగా సౌత్ ఇండియా స్థాయి ప్రాజెక్టును రూపొందించారు. కృష్ణా జిల్లా పోరంకిలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటి బుధవారం పురస్కారం అందుకున్నారు. త్వరలో జరిగే సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఈ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగ సత్యనారయణ తెలిపారు.

అల్లవరం: విజయవాడలోని మురళీ రిసార్ట్సులో రెండు రోజులుగా జరుగుతున్న విద్య, వైజ్ఞానిక సదస్సులో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలోని అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థిని కె.శాల్విన ప్రదర్శించిన మేజిక్ గొడుగు నమూనాకు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం దక్కినట్లు ప్రిన్సిపాల్ కిరణ్మయి బుధవారం తెలిపారు. ఉపాధ్యాయురాలు మౌనిక పర్యవేక్షణలో విద్యార్థిని శాల్విన ఉత్తమ ప్రదర్శన చేశారని తెలిపారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సులలో గురుకులం విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేశారని ఆమె తెలిపారు.

ఆరోగ్యశ్రీని కొనసాగించకుంటే ఆందోళన తప్పదు

అమలాపురం రూరల్: ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి సర్కారు అనారోగ్య శ్రీగా మార్చివేసిందని కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చిట్టిబాబు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. ఈ పథకం తాలూకా బకాయిలు మూడు వేల కోట్లను తక్షణం విడుదల చేయాలని, ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఏఐసీసీ సభ్యుడు వై. రవీంద్ర, పీసీసీ సభ్యుడు మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి

- వేడుకగా సంక్రాంతి సంబరాలు
- అలరించిన రంగవల్లులు
- విజేతలకు విలువైన బహుమతులు
- ముమ్మిడివరంలో దుస్తుల పంపిణీ
- పాఠశాలలు, కళాశాలల్లో ఉట్టిపడిన తెలుగుదనం

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద పట్టణానికి చెందిన ముగ్గురు జ్యూయలర్స్ వ్యాపారులు నిర్వహించిన కోనసీమ స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు అలరించాయి. ఈ పోటీల్లో విజేతలకు వెండి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో 75 మంది మహిళలు పాల్గొని ముత్యాల ముగ్గులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు ప్రకటించి అందజేశారు. అమలాపురం ఆదినారాయణ, కోదండరామ, ఆదిరెడ్డి జ్యూయలర్స్ సంయుక్తంగా ఈ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించాయి. చిత్రకారుడు ఉంధ్రు ఆశీర్వాదం, కవి బీవీవీ సత్యనారాయణ, మహిళా సంఘాల ప్రతినిధి యెండూరి సీతామహాలక్ష్మిలు పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవరించారు. జ్యూయలర్స్ అధినేతలు నల్లమిల్లి ఆదినారాయణరెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ దొమ్మేటి రాము విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కొవ్వూరి శేషారెడ్డి, నల్లమిల్లి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాలకు సంక్రాంతి ప్రతీక అని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని జి.వేమవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సారధి శ్రీకళ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పండగలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించిన వారమవుతామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. హెచ్ఎం ఎం.ఉమ, జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: విశ్వాస్ ఒకేషనల్ కాలేజీలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. భోగి మంటలు, బొమ్మల కొలువు, చెడి తాలింఖానా, ప్రభల ఉత్సవం, పిండి వంటలు తయారు చేశారు. ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి గోదాదేవికి పూజలు చేశారు. విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా సంబరాలు జరుపుకున్నారు. ఆటల పోటీలలో విజేతలకు వేమగిరి సర్వారాయ షుగర్స్ వారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ ఏ.బుజ్జిదొర, ప్రిన్సిపాల్ నక్కా వీర వెంకట సత్యనారాయణ, పి.కృష్ణ, చిన్నిం శ్రీనివాస్, గుత్తాల శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: సంస్కృతీ, సంప్రదాయలకు అనుగుణంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో పనిచేస్తున్న పీహెచ్, నాన్ పీహెచ్, కార్యాలయ సిబ్బందికి ఆయన బుధవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. వీటిని చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఆర్థిక సాయంతో సమకూర్చారు. కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, తహసీల్దార్ సుబ్బలక్ష్మి, ములపర్తి బాలకృష్ణ, వి.బోసురాజు, బొంతు బుజ్జిబాబు, ఎస్ఆర్‌కే రాజు, గణేశుల బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో గాడిమొగ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బందికి గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి నూతన వస్త్రాలు అందజేశారు. బుధవారం గాడిమొగ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రెండు జతల చొప్పున దుస్తులు, చెప్పులు, నిత్యావసర వస్తువులను సర్పంచ్ అందజేశారు. సర్పంచ్ గోవలక్ష్మి మాట్లాడుతూ సంక్రాంతి పండగకు ఏటా నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, నాయకులు కామాడి మాతరాజు, రేకాడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జి.వేమవరం పాఠశాలలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



ముమ్మిడివరం కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంట వేస్తున్న విద్యార్థులు



ముమ్మిడివరంలో సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ రవివర్మ



గాడిమొగలో పంచాయతీ కార్మికులకు దుస్తులు, నిత్యావసరాలు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి తదితరులు